క్లుప్తంగా

పైడితల్లి సన్నిధిలో మంత్రి కొండపల్లి



పైడితల్లి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దంపతులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లిని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభంతో మంత్రి దంపతులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు మంత్రి దంపతులరే వేదాశీస్సులు అందించారు. అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలు, ప్రసాదాలను ఈఓ అందజేశారు.

నేడు అంబేడ్కర్ జయంతి

నెల్లిమర్ల రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గదల సన్యాసినాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక రామతీర్థం జంక్షన్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పలువురు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. మండలంలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

డెంకాడ: మండలంలోని పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై ఎ.సన్యాసినాయుడు అన్నారు. డెంకాడ గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద, రామాలయం వద్ద, కొండరాజుపేట గ్రామాల్లో మొత్తం ఐదు సీసీ కెమెపరాలను ఆదివారం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నేరస్తులను గుర్తించడానికి కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

పుస్తక పఠనంతో మేలు



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, ఇది ఎంతో మేలు చేస్తుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులతో లైబ్రేరియన్ పుస్తకాలు చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజూ పుస్తకాలు చదవడం ద్వారా మంచి జ్ఞానం కలుగుతుందన్నారు. విద్యార్థులంతా గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని కోరారు.

వైద్యం.. దయనీయం!



ఆస్పత్రి వరండాలోని బెడ్లు, బెంచీలపై రోగులకు వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

బాడంగి: స్థానిక సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం)లో వైద్యం.. దయనీయంగా మారింది. రోగులకు అవసరమైన వసతులు లేకపోవడంతో పాటు వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇప్పటికీ వరండాలోనే పలువురు రోగులకు వైద్యం అందిస్తున్న దుస్థితి. ముఖ్యంగా సరిపడ వైద్యులు ఆస్పత్రిలో లేకపోవడంతో రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదు. దీంతో పాటు సరిపడ బెడ్లు కూడా లేకపోవడంతో వరండాలోని రోగుల బంధువులు కూర్చొనే బెంచీలపై రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. గతంలోని ఇదే 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మార్చారు. అయినా ఆ స్థాయి ఆస్పత్రికి సరిపడ సేవలు లేవన్న విమర్శలు రోగుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఆస్పత్రి సేవలు మెరుగుపరచాలని కోరుతున్నారు.

నిత్యాన్నదానం

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన చిరువ్యాపారి వారణాశి జగన్నాథ స్వామి తన ఔదార్యం చాటుకుంటున్నారు. 1500 రోజులుగా నిత్యాన్నదానం కొనసాగిస్తున్నారు. ప్రతిరోజూ 20 మంది అనాథలకు భోజనాలు వండిపెడుతున్నారు. ఓ వైపు తన కుటుంబాన్ని పోషించుకుంటూనే తన సంపాదనలో కొంత మొత్తాన్ని ఇలా పేదల కోసం ఖర్చు చేస్తున్నారు. ఇలా చేస్తుండడం తనకు ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు
- చిన్నారులు, వృద్ధులపై దాడులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



పూసపాటిరేగ భూడివీధి సమీపంలో శునకాలు

పూసపాటిరేగ: గ్రామాలలో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. గ్రామాలలో నిత్యం ఏదో ఒక చోట ప్రజలు కుక్కకాటు బారిన పడుతున్నారు. కుక్క కాటుకు గురైన వ్యక్తులలో కొంతమంది ప్రాణాలు పోగొట్టుకున్న పరిస్థితులుండగా.. మరి కొంతమంది క్షతగాత్రులుగా మారి రేబిస్ వ్యాధి బారిన పడుతున్నారు. కుక్కలను నియంత్రించినట్లు అధికారులు మొదట్లో హడావిడి చేసినా ఆ తర్వాత చేతులెత్తేశారు. గతంలో పంచాయతీ అధికారులు కుక్కలకు ఇంజిక్షన్‌లు ఇచ్చి నియంత్రించేవారు. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. మండల కేంద్రంలో అయితే పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన వారిపై కూడా దాడులు చేస్తున్నాయి. గత ఆరు నెలల కాలంలో పదుల సంఖ్యలో కుక్క కాటుకు గురైన వారున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి కారకాలైన కుక్కలను నియంత్రించకుండా కేవలం ఏఆర్‌వీ వ్యాక్సిన్‌తో సరి పెడుతున్నారు. పీహెచ్‌సీల్లో కూడా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలో పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాలున్నాయి. వాటి పరిధిలో సుందరపేట, నెల్లిమర్ల సీహెచ్‌సీలు.. పూసపాటిరేగ, గోవిందపురం, రెల్లివలస, డెంకాడ, మోపాడ, పోలిపల్లి, సతివాడ పీహెచ్‌సీన్నాయి. వాటి పరిధిలో నిత్యం 30 నుంచి 40 వరకు కుక్కకాటు బాధితులు చికిత్సకు వస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. కుక్కకాటు బాధితులు చాలావరకు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. కుక్కకాటుకు మందులు ఇచ్చేకన్నా... వాటిని నియంత్రిస్తే కొంతమేర ఫలితం ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రతి గ్రామంలో శునకాల సంఖ్య గణనీయంగా పెరిగిపోతున్నా చర్యలు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో వ్యాక్సిన్..

కుక్కకాటు బాధితులకు వేయడానికి ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. పీహెచ్‌సీకి ప్రతిరోజూ ఒకరు కుక్కకాటు గురై వస్తున్నారు. ఎక్కువ మంది వచ్చినప్పుడు సీహెచ్‌సీకి రిఫర్ చేస్తాం. కుక్క కరిచినవెంటనే ఆ ప్రాంతాన్ని బాగా కడిగి ఆస్పత్రికి వస్తే వైద్యం అందిస్తాం.

– రాజేష్‌వర్మ, ఏపీ సుధారెడ్డి వైద్యులు, పూసపాటిరేగ, గోవిందపురం పీహెచ్‌సీలు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

గ్రామాలలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. కుక్కలకు ఇంజిక్షన్లు వేసి సంతాన నియంత్రణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కుక్కల విపరీత సంచారంపై ఉన్నతాధికారులకు తెలియజేశాం. కొన్ని గ్రామాలలో కుక్కల ఏరివేతకు ఇప్పటికే చర్యలు చేపట్టాం.

– జ్ఞానేశ్వరరావు, మండల పంచాయతీ అధికారి, పూసపాటిరేగ.

కరపత్రాల ఆవిష్కరణ



విజయనగరం జిల్లా కేంద్రంలోని లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో పైడిమాంబ కళానికేతన్ ఆధ్యాత్మిక సేవా సంఘం 27వ వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. మంగళవారం మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి గురజాడ కళాభారతి ప్రాంగణంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

దోమల నియంత్రణకు చర్యలు



దోమల నివారణకు చేపడుతున్న ఫాగింగ్

విజయనగరం: నగరంలో దోమల నియంత్రణకు విజయనగరం కార్పొరేషన్ యంత్రాంగం చర్యలు చేపడుతోంది. దోమలు వృద్ధి చెందకుండా అవసరమైన ఫాగింగ్ ప్రక్రియను కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్నారు. ఇందుకోసం రెండు ఫాగింగ్ యంత్రాలు, వాహనాలను వినియోగిస్తున్నారు. అదేవిధంగా దోమల వృద్ధి కేంద్రాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో యాంటీ లార్వా ఆపరేషన్ ప్రక్రియను కూడా చేపడుతున్నారు. కాలువలు, చెత్తకుప్పలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో టెమోఫాస్ ద్రావణం పిచికారీ చేస్తున్నారు. ఇందుకోసం 40 పిచికారీ యంత్రాలను ఉపయోగిస్తున్నామని ప్రజారోగ్యాధికారి కె.సాంబమూర్తి తెలిపారు. అలాగే కుంటలు, చెరువులలో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నామన్నారు.

జలియన్ వాలాబాగ్ సంస్మరణ దినం



చెస్ స్కూల్ విద్యార్థుల ర్యాలీ

విజయనగరం: జలియన్ వాలాబాగ్ (అమృతసర్)లో జరిగిన అమానుష సంఘటనకు గుర్తుగా మన దేశంలో ఏటా ఏప్రిల్ 13న జలియన్ వాలాబాగ్ సంస్మరణ దినం నిర్వహిస్తున్నామని ఆంధ్రా చెస్ అసోసియేషన్ సీఈఓ కేవీ జ్వాలాముఖి అన్నారు. ఈ మేరకు రింగ్ రోడ్డులో ఉన్న ఫైర్ చెస్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎందరో ప్రాణాలను బలిగొన్న ఈ సంఘటన జాతీయోద్యమ గతిని ప్రభావితం చేసిన ముఖ్య సంఘటనల్లో ఒకటన్నారు. రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహిస్తున్నారనే నెపంతో పంజాబ్‌లో ప్రసిద్ధ నాయకులు డాక్టర్ సత్యపాల్, సైఫుద్దీన్ కిచ్లూలను బ్రిటీష్ ప్రభుత్వం నిర్బంధించిందన్నారు. ఈ వార్తతో ప్రజలు పెద్ద ఎత్తున నిరసనకు దిగడంతో ప్రభుత్వం అమృతసర్‌లో మార్షల్ లా విధించిందన్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చే బాధ్యతను జనరల్ డయ్యర్‌కు అప్పగించారని చెప్పారు. 1919 ఏప్రిల్ 13న అమృతసర్‌లో జలియన్ వాలాబాగ్ మైదానంలో ఒకవైపు ఉద్యమకారులు నిరసన సభకు హాజరు కాగా.. అదే రోజున వైశాఖీ పర్వదినం కావడంతో వేడుకల కోసం గ్రామీణులు, పట్టణ వాసులు మరో వైపు సమావేశమయ్యారని తెలిపారు. అయితే ఈ సభలకు అనుమతి లేదనే కారణంతో డయ్యర్ కాల్పులు జరిపించగా.. వందలాది మంది మరణించగా వేల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారన్నారు. ఇప్పటితరం పిల్లలకు స్వాతంత్య్ర పోరాటం గురించి తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫైర్ చెస్ స్కూల్ సిబ్బంది ఆకుల దామోదరరావు, పి.అర్చన, ఎన్.పద్మ, డి. సంతోషి, జి. రమ పాల్గొన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా గుట్కా విక్రయాలు

- ఒడిశా నుంచి తీసుకువస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు
- అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు



నిషేధిత గుట్కా, ఖైనీ ప్యాకెట్లు

నెల్లిమర్ల : నెల్లిమర్ల పట్టణంలో నిషేధిత గుట్కా విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. అన్ని పాన్‌షాపుల్లోనూ, కిరాణా దుకాణాల్లోనూ గుట్కా, ఖైనీ విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పట్టణానికి చెందిన ఇద్దరు వ్యాపారులు ట్రైన్‌ల ద్వారా ఒడిశా నుంచి వీటిని తీసుకొస్తున్నారు. నెల్లిమర్ల పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వ్యాపారులకు సరఫరా చేస్తున్నారు. కొంతకాలంగా ఈ వ్యవహారం గుట్టుచప్పుడు గాకుండా కొనసాగుతోంది. సంబంధిత అధికారులకు ఈ సంగతి తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉంటున్న ఒక వ్యాపారితో పాటు గాంధీనగర్ కాలనీకి చెందిన మరో వ్యాపారి గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యాపారం సాగిస్తున్నారు. నిత్యం ఒడిశా నుంచి రైళ్లలో రహస్యంగా సరుకు తీసుకొస్తున్నారు. ఇళ్ల వద్దనే దొంగచాటుగా నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన చిరు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంతో పట్టణంలో ఈ అక్రమ వ్యాపారం గుట్కాలు ఆరు ఖైనీలుగా కొనసాగుతోంది. అధికారులు స్పందించి నిషేధిత గుట్కా వ్యాపారంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

సమస్యల వలయంలో..

గిరిజన ఆశ్రమ పాఠశాల!



నేరళ్లవలస గిరిజన ఆశ్రమ పాఠశాల



అధ్వానంగా ఉన్న విద్యార్థుల స్నానపు గదులు

- నేరెళ్లవలస పాఠశాలలో మౌలిక వసతులు కరువు
- వరండాలోనే తరగతుల నిర్వహణ
- తరగతి గదుల్లోనే విద్యార్థుల నిద్ర
- శిథిలావస్థలో స్నానపు గదులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



వరండాలోనే తరగతులు



తరగతి గదిలోనే బెడ్లు..

రామభద్రపురం: ఓ నాడు.. ఓ వెలుగు వెలిగిన గిరిజన ఆశ్రమ పాఠశాలలు నేడు కునారిల్లుతున్నాయి. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అవి ఇప్పుడు అనాథ పాఠశాలలుగా తయారయ్యాయి. ఏ పాఠశాలలోనూ మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో లేవు. దీనికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.. రామభద్రపురం మండలం, జన్నివలస పంచాయతీ, నేరళ్లవలస గ్రామ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల. ఇదే పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు మొత్తం 110 మంది ఉన్నారు. అయితే వారి చదువులు సమస్యల మధ్య కొనసాగుతున్నాయి. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలేవీ లేవు. ముఖ్యంగా ఇక్కడి విద్యార్థుల భోజనాలకు సంబంధించి, మెనూ సక్రమంగా అమలు చేయడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ వైపు మౌలిక వసతుల లేమి విద్యార్థులను తీవ్రంగా వేధిస్తుంటే మరోవైపు ఉపాధ్యాయులు కూడా సమయానికి పాఠశాలకు హాజరుకాకపోవడంతో విద్యాబోధన కుంటుపడుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే అక్కడి విద్యార్థులకు ఇవ్వాల్సిన ట్రంకు పెట్టెలు, బెడ్‌లు, బెడ్‌షీట్లు, పళ్లాలు, గ్లాసుల విషయంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం వహిస్తుండడంతో తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కబోతలోనే తరగతులు..

విద్యార్థులకు సరిపడ తరగతి గదులు లేకపోవడంతో వరండాలోనే తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే అవే తరగతి గదులను విద్యార్థులు పడుకునే గదులుగా వినియోగిస్తున్నారు. ఆయా గదుల్లో సరిపడ ఫ్యాన్లు కూడా లేకపోవడంతో ప్రస్తుత వేసవిలో ఉక్కపోతలోనే విద్యార్థుల తరగతులు, నిద్ర కొనసాగుతున్నాయి. ఎప్పుడో ఇచ్చిన బెడ్‌షీట్లు కింద పరు చుకుని పడుకుంటున్నామని, దోమలు విపరీతంగా కుడుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

అధ్వానంగా తరగతి గదులు..

ప్రధానంగా ఈ పాఠశాలలోని మొత్తం నాలుగు తరగతుల గదులు పూర్తిగా అధ్వానంగా తయారయ్యాయి. భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు భవనాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఈ అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న కుళాయిల ద్వారా వచ్చే నీటిని విద్యార్థులు తాగుతుండడం విచారకరం. స్థానికంగా ఉండాల్సిన వార్డెన్ కూడా ఇక్కడ ఉండకపోగా, సంబంధిత అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతోనే ఇలాంటి పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారిందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

అధికారుల దృష్టికి సమస్యలు..

ఇక్కడి పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టడం జరిగింది. తరగతి గదుల కొరత, డార్మెటరీలు లేకపోవడం, కొన్ని క్లాస్‌రూమ్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయన్న విషయాలను తెలియజేశాం. ఉన్నతాధికారులు కూడా పరిశీలనకు ఇక్కడికి వచ్చి, వెళ్లారు. నిధులు మంజూరు కాగానే మౌలిక వసతులు మెరుగుపరుస్తాం.

–జి.కృష్ణారావు, ప్రధానోపాధ్యాయుడు, నేరళ్లవలస గిరిజన ఆశ్రమ పాఠశాల

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



విజయనగరం టౌన్: భారీ ర్యాలీ చేపడుతున్న పాస్టర్ రవికుమార్, క్రైస్తవ భక్తులు



పూసపాటిరేగలో నిర్వహిస్తున్న ర్యాలీ

విజయనగరం టౌన్: పట్టణంలో క్రీస్తు విశ్వాసకులు మట్టల ఆదివారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. పెద్దలు, చిన్నారులు, పెద్దలు అందరూ ఈత మట్టలు చేతబూని అంబటిసత్రం ఏసు ప్రేమాలయం నుంచి సిటీ బస్టాండ్, న్యూపూర్ణ జంక్షన్, ఫైర్ ఆఫీస్, గంటస్తంభం మీదుగా కోట వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పాస్టర్ రవికుమార్ మాట్లాడుతూ, ఏసు క్రీస్తుకు స్వాగతం పలుకుతూ ఈ ర్యాలీ చేపట్టడం ఆనవాయితగా వస్తోందన్నారు. కార్యక్రమంలో సిస్టర్ సువర్ణ, విక్టర్ బాబు, చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగలో..

పూసపాటిరేగ: మండల కేంద్రమైన పూసపాటిరేగలో మట్టల ఆదివారం సందర్భంగా క్రిస్టియన్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూఆర్‌పీఎఫ్ చర్చి పాస్టర్ ఎం.జీవన్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీస్తు జననం, మరణం, పునరుత్థానంపై వివరించారు. గుడ్‌ఫ్రైడే ముందు ఆదివారం మట్టల ఆదివారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. 40 శ్రమదినాలు పాటించి మట్టల ఆదివారం, గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగను జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ పెద్దలు శంకర్, అప్పారావు, అప్పలరాజు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.